క్లుప్తంగా

క్రీస్తు జీవితం ఆదర్శం


విశ్వ, మాజీ ఎమ్మెల్యే


శివరామిరెడ్డి, ఎమ్మెల్సీ

ఉరవకొండ: ఏసుప్రభువు జీవితం అందరికీ ఆదర్శమని, తన బోధనల ద్వారా మానవాళిని సన్మార్గం వైపు నడిపించేలా మార్గ నిర్దేశం చేశారని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. ఈమేరకు మంగళవారం ఓ ప్రకటనలో నియోజకవర్గంలోని క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

రూ.లక్ష విరాళం


విరాళం ఇస్తున్న నాగిరెడ్డి

కణేకల్లు: కణేకల్లు ప్రజల సౌకర్యార్థం నిర్మించతలపెట్టిన వైకుంఠ రథం కోసం వైఎస్సార్‌సీపీ నేత, పాటిల్ సోమశేఖర్‌రెడ్డి మెమోరియల్ ట్రస్టు చైర్మన్ పాటిల్ నాగిరెడ్డి తన వంతుగా రూ. లక్ష విరాళంగా ఇచ్చారు. స్థానిక చిక్కణ్ణేశ్వరస్వామి కళ్యాణమంటపం ఆవరణలో వైకుంఠ రథం నిర్మాణ నిర్వాహకులకు నగదును అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత తహసీల్దార్ బాలకృష్ణ, ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌కే బద్రీ, పాటిల్ బ్రహ్మానందరెడ్డి, రాఘవేంద్రగుప్త, చంద్రశేఖర్ గుప్త, యంత్రకాయల వన్నూరప్ప, రామకృష్ణ, మోహన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గడువులోపు నిర్మాణాలు పూర్తి చేయాలి


మినీగోకులం షెడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డ్వామా పీడీ సలీంబాషా

వజ్రకరూరు: గడువులోపు మినీగోకులం షెడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని డ్వామా పీడీ సలీమ్‌బాషా ఆదేశించారు. మంగళవారం గూళ్యపాళ్యం, వజ్రకరూరు గ్రామాల్లో మినీగోకులం (క్యాటిల్‌షెడ్స్)నిర్మాణ పనులను డ్వామా పీడీ పరిశీలించారు.ఆయా గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి, నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. గడువులోపు నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఏపీఓ లక్ష్మీకాంత బాయి, ఈసీ ప్రభాకర్, టీఏలు నాగరాజునాయక్, హరికృష్ణ,సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా తప్పదు


ఎస్‌ఐ నాగస్వామితో మాట్లాడుతున్న ఆర్‌టీఓ ఎస్.రాజాబాబు

వజ్రకరూరు: వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానా తప్పదని గుంతకల్లు ఆర్‌టీఓ ఎస్.రాజాబాబు హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం వజ్రకరూరు పోలీస్‌స్టేషన్‌ను గుంతకల్లు ఆర్‌టీఓ సందర్శించి, ఎస్‌ఐ నాగస్వామితో మాట్లాడారు. అనంతరం ఆర్‌టీఓ మాట్లాడుతూ ఇటీవల కాలంలో జిల్లాలో ఆటో ప్రమాదాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో వాహన తనిఖీలు విస్తృతంగా చేస్తున్నట్లు తెలిపారు. వాహనదారులు నిబంధనలుతప్పక పాటించాలని, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, ప ర్మిట్ తప్పక ఉండాలన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- ఏడీఏ లక్ష్మానాయక్

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట సొసైటీల్లో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని వ్యవసాయశాఖ ఏడీఏ లక్ష్మానాయక్ సిబ్బందికి సూచించారు. ఈనెల 21న 'అంతా మా ఇష్టం' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన వ్యవసాయాధికారులు మండలంలోని శ్రీధరఘట్ట, ఉద్దేహాళ్ సొసైటీల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. ఉద్దేహాళ్ సొసైటీ ద్వారా 1,992 మెట్రిక్ టన్నులు, శ్రీధరఘట్ట సొసైటీ ద్వారా 1,234 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ సాయికుమార్, వీఈఓలు నాగరాజు, హనుమంతు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

ఉరవకొండ: బాల్య వివాహాలను అరికట్టడానికి కృషి చేద్దామని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి, ఎంపీడీఓ రవికుమార్, మండల విద్యాశాఖ అధికారి రమాదేవి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వీరశైవ కళ్యాణ మంటపంలో కిశోరి వికాసం మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాకెట్ల, కొకుంట్ల పీహెచ్‌సీలల హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, రమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజమ్మ, రాబియా, తిరుపాల్‌బాయి, విజయకుమారి పాల్గొన్నారు.

లింకు నొక్కారో .. ఖాతా ఖాళీ

- ఖాతాల్లో మాయమవుతున్న నగదు
- రోజురోజుకూ పెరుగుతున్న బాధితుల సంఖ్య
- బ్యాంకులు, పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్న బాధితులు
- ఎక్కువగా మోసపోతున్నది అక్షరాస్యులే



రాయదుర్గం:

- డీ హీరేహాళ్ మండలంలోని గొడిశెలపల్లికి చెందిన హనుమంతరెడ్డికి ఓ అగంతకుడు వాట్సాప్ ద్వారా లింక్ పంపాడు. ఏదో అనుకొని పొరపాటున దానిపై క్లిక్ చేశాడు. వెంటనే రూ.2 లక్షలు ఖాతా నుంచి ఖాళీ అయ్యింది. ఆ తర్వాత తేరుకున్న అతను బ్యాంకు మేనేజర్ సహాయంతో ఖాతాను హోల్డ్ చేయించారు. దీంతో ఇంకా ఖాతాలో ఉన్న మరో రూ.7 లక్షలు సేవ్ అయ్యింది.
- రాయదుర్గం పట్టణానికి చెందిన సురేష్‌కు ఇటీవల క్రెడిట్ కార్డు అప్‌డేట్ చేసుకోవాలని మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. ఆ లింక్ ఓపెన్ చేయగానే ఖాతాలోని రూ.90 వేలు పోగొట్టుకున్నాడు. న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.
- రాయదుర్గంలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న ఓ ప్రభుత్వ ఉద్యోగికి వీడియో కాల్ వచ్చింది. బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం.. మీ ఫోన్‌పేకు రూ.లక్ష జమచేశాం..చూసుకోమన్నాడు. ఫోన్ లాక్ తీసి అందులో పాస్‌వర్డ్ ఎంటర్ చేయగానే దాని ఆధారంగా వెంటనే రూ.5 లక్షలు లాగేసుకున్నారు. ఈవిషయాన్ని బయటకు చెప్పుకోలేక లోలోన కుమిలిపోతున్నాడు.
- ఓబుళాచారి రోడ్డులో నివాసం ఉండే సురేష్ వాట్సాప్‌నకు మెసేజ్ వచ్చింది. దానికి రిప్లై ఇచ్చాడు. కొంత నగదు డిపాజిట్ చేస్తే రూ.2 లక్షలు తిరిగి జమ చేస్తామని, ఇప్పుడే ఈ పథకం లాంచింగ్ అయ్యింది.. అందులో లక్కీగా మీ నంబరే కనిపించని నమ్మించారు. రూ.20 వేలతో మొదలుపెట్టి రూ.1.16 లక్షలు అతని ఖాతా నుంచి తీసేసుకున్నారు.
- మండలం ఆర్.కొత్తపల్లిలోనూ ఓ విద్యార్థి రూ.70 వేలు మోసపోయాడు. ఇలా ఉరవకొండతో పాటు కళ్యాణదుర్గం సబ్ డివిజన్ వ్యాప్తంగా ఏదో ఒక చోట ప్రజలు సైబర్ వలకు చిక్కి విలవిల లాడుతున్నారు.

ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు ఇవీ..

- సెల్‌ఫోన్‌కు వచ్చే లింక్‌లను జాగ్రత్తగా గమనించి తెరవాలి.
- యూపీఐ ద్వారా చెల్లించే బ్యాంకు ఖాతాల్లో తక్కువగా డబ్బు ఉండేలా చూసుకోవాలి.
- థర్డ్‌పార్టీ అప్లికేషన్లు అసలు తెరవొద్దు.
- గుర్తు తెలియని వ్యక్తుల ఖాతా వివరాలు, ఆధార్, ఓటీపీ వంటివి చెప్పొద్దు.
- గూగుల్ సెర్చ్ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి.
- తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు ఇస్తాం అనే వారి మాటలు, ప్రకటనలు నమ్మకూడదు.
- గుర్తు తెలియని కాల్స్, మెసేజ్‌లకు స్పందించరాదు. మీ ప్రమేయం లేకుండానే మీ ఫోన్‌లో ఏదైనా యాప్ డౌన్‌లోడ్ అయిందా చూసుకోవాలి. ఫోన్ వాడకుండానే చార్జింగ్ తగ్గిపోతుందంటే అనుమానించాల్సిందే.
- నా వాట్సాప్ బ్లాక్ అయ్యింది. మీ నంబర్‌కు ఓటీపీ పంపాను. అది పంపిస్తే అన్‌లాక్ చేసుకుంటాను అని ఎవరైనా అడిగితే పొరపాటున కూడా ఓటీపీలు పంపవద్దు. తెలిసిన వ్యక్తుల్లానే నమ్మించి మోసం చేసే వారి సంఖ్య ఎక్కువైంది.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి మోసపోతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఓ వైపు దీనిపై పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నా.. కొందరిని సైబర్ నేరగాళ్లు అమాయకులను చేసి మోసాలు చేస్తున్నారు. సైబర్ బాధితుల్లో ఎక్కువగా చదువుకున్న వాళ్లు ఉండడం గమనార్హం. మూడు నియోజకర్గాల్లో ఈ మూడు నెలల్లోనే సుమారు 50 మందికి పైగా ఈ మాయగాళ్ల ఉచ్చులో పడ్డారంటే..వారు ఎంత చాకచక్యంగా మోసం చేస్తున్నారో తెలుస్తోంది. పలు విధాలుగా సైబర్ నేరాలు నమోదవుతున్నాయి. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు కొత్త విధానాన్ని ఎంచుకున్నారు. లింకు పంపి క్లిక్ చేయగానే ఖాతాల్లోని నగదు మాయం చేయడం ఓ రకమైతే, వీడియోకాల్ చేస్తూ దోపిడీకి పాల్పడుతుండం మరో మోసం అని బాధితులు వాపోతున్నారు. ఏది ఏమైనా సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు మరింత జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. కరోనా వైరస్ కంటే ఈ నేరాలు అత్యంత ప్రమాదకరంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో వైరస్ పట్ల సెల్‌ఫోన్ల ద్వారా ఎలా జాగ్రత్త పరిచారో ప్రస్తుతం పోలీసు యంత్రంగా కూడా అదేతరహా వ్యవహరిస్తున్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



సైబర్ మోసాలపై ప్రజలంతా జాగ్రత్తలు పాటించాలి. వ్యక్తి గత ఖాతాల నుంచి ఉన్నపళంగా నగదు ఖాళీ అవుతున్నట్లు ఇటీవల కొన్ని ఫిర్యాదులు వచ్చాయి. సైబర్ నేరగాళ్ల భరతం పట్టడానికి ఉక్కుపాదం మోపాం. ప్రజలు కూడా వీరి ఉచ్చుకు చిక్కకుండా జాగ్రత్తలు పాటించాలి. సెల్ ఫోన్లలో కొత్తయాప్‌లు, ఓటీపీలు, ఆధార్, బ్యాంకు ఖాతాలు సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా చూసుకోవాలి. గుర్తు తెలియని వీడియో కాల్స్‌ను రిసీవ్ చేసుకోవడం సరికాదు.

– జయనాయక్, అర్బన్ సీఐ, రాయదుర్గం

ఆధ్యాత్మికం

యల్లమ్మ అమ్మవారి రథోత్సవం

కుందుర్పి: నాగేపల్లిలో యల్లమ్మ అమ్మవారి రథోత్సవం మంగళవారం నేత్ర పర్వంగా సాగింది. ఉదయం ఆలయంలో అమ్మవారికి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు మడుగు రథోత్సవం, సాయంత్రం ధూళోత్సవం సందర్భంగా ఆలయం నుంచి రథన్నా ఊరేగించారు.

మాలధారుల ఇరుముడి

ఉరవకొండ: గుంతకల్లు రోడ్డులో వెలసిన జగదీశ్వరీ అమ్మవారి ఆలయంలో మాలధారులు మంగళవారం ఇరుముడి కట్టారు. వైఎస్సార్ జిల్లా చిట్వేలు మండలం ఆగ్రహారానికి ఇరుముడితో 300 మంది జగదీశ్వరి ఆలయ ధర్మకర్త గాజుల శ్యామలమ్మ ఆధ్వర్యంలో ఊరేగింపుగా బయల్దేరారు.

ఘనంగా గైబ్‌షావలి ఉరుసు

కణేకల్లు: స్థానిక రామనగర్‌లో వెలసిన గైబ్‌షావలి ఉరుసు మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. హిందూముస్లింలు కలసికట్టుగా జరుపుకునే ఉరుసుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గైబ్‌షావలి సమాధిని వస్త్రాలు, పూలచద్దర్‌లతో అలంకరించి, ప్రత్యేక ఫాతేహాలు చేయించారు.

కుంగిన కల్వర్టు


కల్లుదేవనహళ్లి వద్ద కుంగిపోయిన కల్వర్టు

బొమ్మనహాళ్ కల్లుదేవనహళ్లి సమీపంలోని వేదవతి పెద్ద హగరి నదిపై నిర్మించిన కల్వర్టు మంగళవారం కుంగింది. ఈ కల్వర్టు మీదుగానే ఉరవకొండ, బళ్లారి, బొమ్మనహాళ్ తదితర 30 గ్రామాలకు ప్రజలు వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. వాహనాల రద్దీ , భారీ వర్షాలు, వరదలతో మంగళవారం కుంగిపోయింది.

'దుర్గం' అభివృద్ధికి సహకరించాలి

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు


సమస్యలను ప్రస్తావిస్తున్న కౌన్సిలర్లు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పట్టణాభివృద్ధికి పాలకవర్గ సభ్యులందరూ సహకరించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. మంగళవారం కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం, బడ్జెట్ ప్రత్యేక సమావేశం జరిగింది. సమావేశానికి ఎక్స్‌అఫీషియో హోదాలో హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి కౌన్సిల్ సభ్యులంతా సహకరిస్తే ముందుకు సాగవచ్చన్నారు.

రూ.36.30 కోట్ల బడ్జెట్ ఆమోదం

తొలుత జరిగిన మున్సిపల్ ప్రత్యేక బడ్జెట్ సమావేశంలో పురపాలక సంఘం 2025–26వ ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలు, 2024–25 సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. బడ్జెట్ అంచనాలు, సవరణలపై కౌన్సిలర్లు బండి అజయ్, పొరాళ్ల గోవిందరాజులు కొన్ని సందేహాలను లేవనెత్తి నివృత్తి చేసుకున్నారు. 2025–26వ ఆర్థిక సంవత్సరానికి అన్ని పద్దుల కింద సాధారణ, మూలధన రాబడి ప్రారంభ నిల్వతో సహా రాబడి, ఖర్చులు కలిపి సుమారు రూ.36.30 కోట్లతో బడ్జెట్ అంచనాను ఆమోదించారు. ఇందులో ప్రారంభ నిలువ రూ.4.86 కోట్లు కాగా, ఆస్తిపన్ను, మార్కెట్ వేలాలు, ప్రకటన పన్నులు, స్టాంప్ డ్యూటీ, అద్దె రూములు, నీటి చార్జీలు, అభివృద్ధి రుసుం, లైసెన్సులు తదితర వాటిని కలిపి రూ.31.44 కోట్ల జమ రూపంలో వస్తాయని అంచనా వేశారు. మొత్తం రూ.36.30 కోట్ల అంచనాతో తయారైన బడ్జెట్‌లో రూ.35.31 కోట్లు ఖర్చు అవుతుందని చూపి రూ.98.44 లక్షలను ముగింపు నిలువుగా బడ్జెట్‌లో పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించండి ..

సాధారణ సమావేశంలో పలు సమస్యలను కౌన్సిలర్లు ప్రస్తావించారు. పట్టణంలో కుక్కలు, పందులు, పశువుల బెడద అధికంగా ఉందని కౌన్సిలర్ పద్మజ, బండి అజయ్ ఉందన్నారు. 29వ వార్డు కౌన్సిలర్ జ్యోతి మాట్లాడుతూ శాంతినగర్‌లోని అనేక వార్డుల్లో ఇండస్ట్రియల్ ఏరియా కావడంతో ఇంటి ప్లాన్ కోసం అనుమతులు లభించడం లేదని సమస్యను పరిష్కరించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, సీఐ జయానాయక్, మున్సిపల్ ఏఈలు నరసింహులు, ప్రతాప్, ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు, హౌసింగ్ డీఈ రంగస్వామియాదవ్, ఎంఈఓ వెంకటరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

కంబదూరు: ప్రజా సమస్యలు పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ వసంత బాబు తెలిపారు. మంగళవారం మండలంలోని గూళ్యం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్డీఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మి నరసింహ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: భూసమస్యలను సత్వరమే పరిష్కరించి రైతులకు మేలు చేయడానికి రెరెవెన్యూ సదస్సులు చక్కటి వేదికలు అని తహసీల్దార్ నయాజ్ అహమ్మద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయ ఆవరణలో రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. సర్పంచు మోనాలిసా,సర్వేయర్ మంజుల, ఆర్‌ఐ అశ్వర్థనారాయణ, వీఆర్వోలు మారెన్న, భరత్ కుమార్, కార్యదర్శి మల్లయ్య పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం భూపసముద్రం గ్రామంలో గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్పంచ్ అనిల్‌కుమార్, డీటీ రఘు, ఆర్‌ఐ రామాంజినేయులు , దేవదాయ, అటవీశాఖ అధికారులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: కమ్మూరులో అధికారులు మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ, ఇతర సమస్యలపై ప్రజల నుంచి 56 వినతులు వచ్చాయి.సర్పంచులు రంగారెడ్డి, రామాంజనేయులు, డీటీ సూర్యప్రతాప్ , రీ సర్వే డీటీ ప్రసాద్, సర్వేయర్ ఆయేషా సిద్దిక్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ మునివేలు తెలిపారు. మంగళవారం మండలంలోని గోవిందవాడ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కంబదూరు: ఈనెల 26న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ లక్ష్మీదేవమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు.

విద్యుత్ చార్జీల బాదుడుపై పోరుబాట


మెట్టు విశ్వతో కలసి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు

రాయదుర్గం: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల బాదుడుపై ఈనెల 27న పోరుబాట చేపట్టినట్లు వైఎస్సార్‌సీపీ యువనేత మెట్టు విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ నెల 27న రాయదుర్గంలో తలపెట్టిన పోరుబాటను వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలు, రైతులు, రైతు సంఘాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం తన నివాసం వద్ద వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మేకల శ్రీనివాసులు, మైనార్టీ నాయకుడు రహంతుల్లా, నాయకుడు ఎరగుంట కేశవరెడ్డి, పొరాళ్ల శివ, సోములాపురం సుదర్శనరెడ్డి, కౌన్సిర్లు, వార్డు ఇన్‌చార్జులతో కలసి పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం పార్టీ నేతలతో కలిసి విశ్వ మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాయంపల్లి రామాంజనేయులు, కౌన్సిలర్లు శ్రీనివాసరెడ్డి, పొరాళ్ల గోవిందరాజులు, శారద, శ్రీలక్ష్మి, మమత, నసీమా, గజాల, షాబీరాబీ, కోఆప్షన్ సభ్యుడు శ్రీనివాసులు, నజీర్, వార్డు ఇన్‌చార్జులు గోల్డ్ ఇస్మాహీల్, బషీర్, నిజామ్, దివాకర్, వైజాక్ రవి, మెకానిక్ బాషా, మురడి మురళీమోహన్‌రెడ్డి, అంజిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, ఉమేష్‌యాదవ్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ ర్యాలీ


ఉరవకొండ పార్టీ కార్యాలయంలో విద్యుత్ చార్జీల పెంపు పై పోరుబాట పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

ఉరవకొండ: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల మోతను నిరసిస్తూ ఈనెల 27న నియోజకవర్గ కేంద్రంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పోరుబాట చేపట్టనున్నట్లు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో పోరుబాట పోస్టర్లను పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఆధ్వర్యంలో విడుదల చేశారు. వీరన్న మాట్లాడుతూ ఈనెల 27న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాల నుంచి ఉదయం 9 గంటలకు నిరసన ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. ఉరవకొండ, కూడేరు ఎంపీపీలు నరసింహులు, నారాయణరెడ్డి, మండలాల కన్వీనర్లు బైరెడ్డి రామచంద్రారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, మూలగిరపల్లి ఓబన్న, బసవరాజు, ఎంపీటీసీలు ఈడిగ ప్రసాద్, ఈశ్వర్, పట్టణ నాయకులు పచ్చి రవి, ఆసీఫ్, మల్లి, నిమ్మల వెంకటరమణ, కమ్మటి రామాంజనేయులు, ఎస్సీసెల్ నాయకులు ఎర్రిస్వామి, అయ్యర్‌దాదు పాల్గొన్నారు.

అ 'పూర్వ' సమ్మేళనం


48 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

కణేకల్లు: కణేకల్లు జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు మంగళవారం ఒకచోట కలిశారు. 1976–77 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం జరిగింది. నాటి గురువులైన రామప్ప, నాగరాజు, వన్నూరుసాబ్, జయన్న, జాఫర్‌సాబ్, సాయినాథ్, సత్యనారాయణ, నాగప్పశెట్టి, సుబ్బన్నలకు శాల్వలు కప్పి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి మున్నర్ బాషా, కణేకల్లు చెరువు సంఘం మాజీ సాగునీటి అధ్యక్షుడు వేలూరు మరియప్ప, మోహన్, రవీంద్రారెడ్డి, కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్ సీనియర్ అసిస్టెంట్ ఫరూక్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బచ్చేహళ్లిలో రెవెన్యూ సదస్సు

శెట్టూరు: మండలంలోని బచ్చేహళ్లి పంచాయతీలో మంగళవారం రెవెన్యూ సదుస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి రైతులను నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం వినతులు అందాయి. కార్యక్రమంలో సర్పంచ్ ప్రకాష్, ఎంపీటీసీ నరసింహులు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రజలపై భారం మోపుతున్న ప్రభుత్వం

కూడేరు: అదనపు చార్జీల పేరిట విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై ప్రభుత్వం భారం మోపుతోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కేశవ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కూడేరులో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 26 సీపీఐ వార్షికోత్సవం జరుపుకోనున్నట్లు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు పెరుగు సంగప్ప, కార్యదర్శి నారాయణమ్మ, నాయకులు రమణ, మలరాయుడు పాల్గొన్నారు.

రెండు దుకాణాల్లో చోరీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని శాంతినగర్ బళ్లారి రోడ్డు పక్కనున్న దుర్గప్ప, వెంకటేశులుకు చెందిన చిల్లర దుకాణాల్లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. సబ్బులు, సిగరెట్ బాక్సులు, కూల్‌డ్రిక్స్‌తోపాటు నగదును ఎత్తుకెళ్లారు. దుర్గప్ప దుకాణంలో సరుకులతోపాటు సీసీ కెమెరా ఎత్తుకెళ్లారు. రెండుదుకాణాల్లో రూ.50 వేల విలువజేసే సరుకులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రేపటి నుంచి ప్రత్యేక ఆధార్ కేంద్రం

గుమ్మఘట్ట: మండలంలోని 75 వీరాపురం గ్రామ సచివాలయంలో ఈ నెల 26 నుంచి 28 వరకు ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

30న మండల సర్వసభ్య సమావేశం

గుమ్మఘట్ట: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 30న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆయకట్టు రైతుల సమావేశం వాయిదా

గుమ్మఘట్ట: ఈనెల 24న జరగాల్సిన ఆయకట్టు రైతుల సమావేశం ఈనెల 28వతేదీకి వాయిదా వేస్తున్నట్లు జలవనరుల శాఖ ఏఈ సాయిరాం తెలిపారు. కొన్ని అనివార్యకారణాల వల్ల బీటీపీ ఆయకట్టు రైతుల సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అసాంఘికకార్యకలాపాలపై నిఘా ఉంచండి

వజ్రకరూరు: అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలని గుంతకల్లు డీఎస్పీ ఎ.శ్రీనివాస్ సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గుంతకల్లు డీఎస్పీ తనిఖీ చేశారు. 2022 నుంచి ఇప్పటి వరకు నమోదయిన కేసులు, వాటి పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలో శాంతిభద్రతలు, ప్రస్తుత పరిస్థితుల పైనా ఆరాతీశారు. రూరల్ సీఐ చిన్న గౌస్, ఎస్‌ఐ నాగస్వామి, పోలీసులతో సమావేశం నిర్వహించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కణేకల్లు: మండలంలోని తుంబిగనూరు గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న యన్నప్పను అరెస్ట్ చేసి, 90 హైవార్డ్స్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఉమాబాయి తెలిపారు. ఎస్‌ఐ షేక్షావలీ, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

కిరాణా కొట్టులో చోరీ

డి హీరేహాళ్ (రాయదుర్గం): డీహీరేహాళ్ మండలం లింగమ్మనహళ్లిలో ఓ కిరాణా కొట్టులో చోరీ జరిగిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఓ విద్యార్థి దుకాణంలో చొరబడి రూ.80 వేల నగదు ఎత్తుకెళ్లాడు. ఆలస్యంగా గమనించిన యజమాని చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి విచారణ చేపట్టారు.

కౌలు రైతుల సమస్యలు పట్టని ప్రభుత్వం

విడపనకల్లు: కౌలు రైతుల సమస్యలు ప్రభుత్వం పట్టించుకోలేదని సీపీఎం జిల్లా నాయకులు రంగారెడ్డి, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బోయ వెంకటేశులు అన్నారు. మంగళవారం కూటమినేతలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, ప్రస్తుతం పాలనపై ఆయన మాట్లాడారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడంలోను,రుణాలు మంజూరు చేయడంలోను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విజయలక్ష్మి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా టి.విజయలక్ష్మి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం కేఎస్‌ఆర్ బాలికల కళాశాల బాటనీ లెక్చరర్‌గా పని చేస్తున్న ఈమెను ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఈ మేరకు కళాశాలలో బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్‌కు అధ్యాపకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

7న ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలు

రాయదుర్గంటౌన్: పట్టణంలో జనవరి 7న జరగనున్న ఏఐవైఎఫ్ 20వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఏపీఎన్జీవో భవనంలో మహాసభ పోస్టర్లను స్థానిక ఏఐవైఎఫ్ నాయకులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌కృష్ణ, జిల్లా నాయకులు దేవేంద్ర, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కుమార్‌నాయక్, కొట్రేష్, జిల్లా కోశాధికారి ఆంజనేయులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి

కూడేరు: ప్రజలకు అందుబాటులో ఉండే మెరుగైన వైద్య సేవలందించాలని ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌ఓ నారాయణ స్వామి మండల సిబ్బందికి సూచించారు.మంగళవారం ఆయన కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) సందర్శించారు. పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలపై రోగులతో ఆరా తీశారు. పీహెచ్‌సీ డాక్టర్ లక్ష్మీనారాయణ పీజీ కోర్సు చేసేందుకు వెళ్తుండడంతో ఆయనకు అభినందన సభ జరిగింది. ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌ఓ నారాయణ స్వామి ముఖ్య అతిథిగా పాల్గొని లక్ష్మీనారాయణను అభినందించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు యశోద, రవీంద్ర, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, ఎంహెచ్‌ఎల్‌పీలు, ఏఎన్‌ఎంలు , ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అనధికార లే అవుట్లపై చర్యలు

రాయదుర్గంటౌన్: అనధికారిక లేఅవుట్లు వేసి ప్లాట్లు విక్రయాలు చేపడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. అనధికారిక లేఅవుట్లపై టౌన్ ప్లానింగ్ అధికారులు కొరఢా ఝులిపించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో వేసి దాదాపు 8 లేఅవుట్లలో ప్లాట్ల కోసం పాతిన రాళ్లను తొలగించారు. మంగళవారం అనంతపురం రోడ్డులోని ఒకటి, గలగల రోడ్డులోని నాలుగు లేఅవుట్లలో అడిగుప్ప రోడ్డులో రెండు, ఆర్ స్కూల్ దగ్గర ఒకటి, ముత్తరాసి కాలనీలో రాళ్లను తొలగించారు.

ఆటో బోల్తా పడి.. పది మందికి గాయాలు

ఉరవకొండ: ఉరవకొండ నుంచి గడేహోతూరుకు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో బోల్తాపడి పదిమందికి గాయాలయ్యాయి. మంగళవారం గడేహోతూరు గ్రామానికి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో పంచాయతీ కార్యాలయం సమీపంలో బోల్తా పడింది. దీంతో అక్కడ ఉన్న స్థానికులు గాయపడిన వారిని ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. గాయపడిన వారిలో గడేహోతూరుకు చెందిన అక్షయ, అంజినమ్మ, భారతి, మౌనిక, చిన్న, సుమంతి, కవిత, లక్ష్మి, నందిని తదితరులు ఉన్నారు.

సౌత్‌జోన్ ఖోఖో జట్టుకు ఎంపిక

రాయదుర్గం: సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో పోటీలకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తరఫున రాయదుర్గం కేటీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు నిషార్‌అహ్మద్, రఘు, గోపి ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. డిసెంబర్ 26 నుంచి 31 వరకు తమిళనాడులోని తిరువారూర్ సెంట్రల్ యునివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ క్రీడా పోటీలకు మన విద్యార్థులు ఖోఖో జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఎన్సీసీటీఓ కిరణ్, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రశాంత్, రిటైర్డ్ హెచ్‌ఎం సత్యనారాయణ, అధ్యాపకులు గురుమూర్తి, నారాయణ, దేవదాస్, పాలరాజ్, గోవర్ధన్, పాండురంగ పాల్గొన్నారు.